# పతిత పావని

**కా**లగతిలో నాలుగు సంవత్సరాలు కలిసిపోయాయి.

మళ్ళీ అదే ఆర్.ఓ హెడ్ క్వార్టర్సుకి బదిలీ అయింది రమణకు. ఆ వాతావరణంలో మళ్ళీ మీరా స్మృతి పథంలో మెదిలింది. ఆమె ఎలా ఉందో తెలుసుకోవాలనే ఆకాంక్ష ప్రబలమవగా ఆ సెక్షన్ ఇన్స్పెక్షనుకు బయలుదేరాడు రమణ.

రావికొలను స్టేషను వస్తూండగానే రమణ లేచి తలుపు తెరచి పట్టుకునిల్చున్నాడు. అతనికి తెలుసు - ఇవాళ మీరా తన కోసం స్టేషనులో ఎదురు చూస్తూ వుండదని. కాని అంతరాంతరాల్లో ఏదో ఆశ. అలా నిల్చుని పరుగెత్తుకొచ్చే రైల్వేస్టేషన్ను చూస్తుంటే మీరా తోడి తన పరిచయం గుర్తుకొచ్చింది రమణకు. ఆనాటి తన ఆశలు, ఆకాంక్షలు, ఆదర్శాలు ఈనాటి ఈ క్షణంలో విచిత్రంగా తోచాయి.

ఆరోజు తనకిప్పటికీ బాగా గుర్తు....

★ ★ ★

చెట్లూ, మిట్టలూ, పల్లాలూ కదలిపోతున్నాయి. వేగంగా పోతున్న బండిలో నుండి చూస్తే భూమి అంతా పచ్చటి ముఖమల్ పరుచుకున్నట్టుంది. దూరంగా ఏవో ఇళ్ళు కన్పిస్తున్నాయి. ఏదో పల్లెటూరు. తను పుట్టింది పల్లెటూళ్ళోనే అయినా జీవితమంతా పట్టణాల రద్దీలోనే గడిచిపోతోంది. ఉద్యోగిగా స్థిరపడింది కూడా పట్నంలోనే. రైల్వే మెయిల్ సర్వీసులో సార్టరు ఉద్యోగం. ఆ పట్నం నుండి మూడువందల మైళ్ళదూరంలో వున్న పట్నానికి వారంరోజులకోమారు డ్యూటీమీద వెళ్ళిరావాల్సి వచ్చేది.

కర్నాటక రాష్ట్రంలో బయలుదేరిన బండి ఆంధ్రప్రాంతం గుండా పయనిస్తుండేది. ఈ ఉద్యోగంవల్ల ప్రవాసాంధ్రుడయిన తనకు వారానికోసారయినా తెలుగువాళ్ళను, తెలుగు దేశాన్ని చూసే భాగ్యం కలిగేది.

బండివేగం తగ్గి మెల్లగా సాగిపోతోంది. తను లేచి వాన్ తలుపు తెరచి నుంచుని చూస్తున్నాడు. ఆ స్టేషనువస్తోంది. ఆత్రంగా దృష్టినంతా కేంద్రీకరించి చూస్తున్నాడు. ఆమె కనిపిస్తుందా అని. బండి స్టేషనులో ఆగింది. ఏమయింది ఆమె, కన్పించదేం? అదుగో... స్టేషను బయటి కిటికీలో నుండి తొంగిచూస్తోంది.

అదే ఎరుపు రంగు వోణీ, నీలం పరికిణీ, నల్లటి ముఖం, తెల్లటిపళ్ళు, కుదురైన గుండ్రటి

ముఖం, లంబాడి స్త్రీ ఆమె. తనని చూడగానే ఆమె ముఖం వికసించింది. తెల్లగా వెన్నెలలా, చల్లగా మృదువుగా నవ్వింది. ఆడదాని ఐశ్వర్యం, అందం - ధనం, హోదా, చదువు, అంతస్థు కాదు. అది ఆమెకు పుష్కలంగానే వుంది. ఆ ఐశ్వర్యాన్ని దోచుకుంటోన్న సమాజం ఆమెను నిరుపేదగానే దీనహీన చరిత్రగానే వుంచేసింది. తనకప్పుడు ఆ సంగతి తెలీదు.

మెయిల్ ఫ్యాను వచ్చి ఉత్తరాల సంచులడుగుతున్నాడు. తనతన్ని గుర్తించలేదు.

''సార్.... మీరా కావాలాసార్!''

తను ఇహలోకంలోకి వచ్చాడు.

''ఏవిటి... ఏం కావాలంటున్నావు?''

''ఏం లేదు సార్! నీరా అగ్గువకు దొరుకుద్ది కావాలా?'' అని తడబడ్తూ మాట మార్చేశాడు మెయిల్ ఫ్యాన్.

''ఎదురుగ్గా నిలబడ్డ లంబాడీ పిల్లపేరు మీరానా!''

''ఔను సారూ! కావాలంటే ఇప్పుడే చెప్పండి. అడ్వాన్సు ఇస్తే అంతారెడీ'' అన్నాడు అతను ఓ వెకిలి నవ్వునవ్వుతూ.

ఆమాట వినేటప్పటికి తన మనస్సు చివుక్కుమంది. ఆకాశంనుండి అగాథంలోకి విసిరేసినట్లనిపించింది. ఏదో ఆక్రోశం, రోషం, కోపం. బండి కదిలింది.

''ఎంత ఇవ్వాలి అడ్వాన్సు.''

''ఐదు రూపాయలిచ్చేయండి సార్! మెయిలు ఫ్యాను గొంతు దూరంగా వినిపిస్తోంది - తను కంపార్ట్‌మెంట్ ఇనపకడ్డీ పట్టుకు నిలబడ్డాడు. ఆ లంబాడీపిల్ల మీరా లేచినిలబడింది. అలాగే నవ్వుతూ తన కళ్ళల్లోకి సూటిగా చూస్తోంది. ఆ చూపులో, నవ్వులో ఆహ్వానముంది. ఆతృత వుంది. పేదరికపు వివశత్వం వుంది. దారిద్ర్యపు వక్రగహ్వారం ఆమె అయివుంది. ఎర్రఓణి కన్పించేంత వరకూ తను అలాగే నిలబడిపోయాడు.

ఆ తరువాత తెలిసింది తనకు. రావికొలనుకు రెండుమైళ్ళదూరంలో ఓ చిన్న టౌను వుంది. ఆ టౌనుకు దగ్గరి రైల్వేస్టేషను ఇదే. అందువల్ల టౌనుకెళ్ళాల్సిన జనం ఇక్కడే దిగుతారు. మీరా తన పాసింజర్లనాకర్షించటానికి బండి వచ్చే టైముకి స్టేషనుకు వస్తుంది.

ఓసారి డ్యూటీ మీద వచ్చినప్పుడు తను ఆమెను చూశాడు, ఆ స్టేషనులో కిటికీమీద కూర్చునివుండగా. ఆమె ఆకృతిలో ఏదో ఆకర్షణ, ఆమె తనకేసి తలతిప్పి చూసింది. ఓ క్షణకాలం తన కళ్ళలోకి చూసి తలతిప్పేసుకుంది. తను డ్యూటీమీద వచ్చినప్పుడల్లా ఆమెకేసి చూస్తుండేవాడు. ఆమెకూడా తనకేసి చూస్తుండేది. ఎప్పుడూ ఆమెని పలకరించాలన్న కోరిక తనకు కలగలేదు.

తలుపులేసి లోపలకు వచ్చిన తనకు చికాకు అన్పించింది. పనిలో సరిగా మనసు లగ్నం

చేయలేకపోయాడు. ఆర్టికల్స్ మిస్సార్టు అవుతున్నట్టున్నాయి. ఇంకా మెయిల్ ఫ్యాన్ అన్నమాటలు మనస్సులో రింగుమంటున్నాయి. 'అడ్వాన్సు ఇస్తే అంతా రెడీ.' 'ఐదురూపాయలు సార్?'... మీరా డబ్బుకోసం శరీరాన్ని అమ్ముకునే పడతి అని తనెప్పుడూ అనుకోలేదు.

బండి లేటయినట్లుంది. డ్రైవర్ టైము కవర్ చేసే ధోరణిలో వున్నాడు. బండి వేగం ఎక్కువైన కొద్దీ పనిపేరుకుపోతున్నట్లనిపించి పనిలో మనసు లగ్నంచేయ ప్రయత్నించాడు తను.

ఆ తరువాత నెలరోజుల వరకు ఆమెని చూడటం పడలేదు. తనకు వేరే సెక్షన్‌లో డ్యూటీ పడింది. అయినా ఆమె ఎప్పుడూ గుర్తుకొచ్చేది. ఒకోసారి ఆమె పరిస్థితి పట్ల జాలికలిగేది. మరొకప్పుడు ఏవగింపు కలిగేది. శరీరాన్నమ్ముకోవాల్సిన పరిస్థితుల వివశత్వమేమిటో ఆమెకు? కడుపు నింపుకోటానికే అయితే ఏ కూలిపనయినా చేసుకుని బతకవచ్చుగా? ఆ పల్లెటూళ్ళో పనిమాత్రమిచ్చేవాళ్ళు ఎవరు? ఎవరిది ఆ తప్పు? ఆమెదా? సమాజందా? వ్యవస్థదా?

ఎవరో తలుపు తడుతున్నట్లుంటే లేచి తలుపు తీశాడు తను. ఎదురుగ్గా బాలాజీ కనబడ్డాడు ఆర్డరు పుస్తకం పట్టుకుని.

''రేపు మీరు బండికెళ్ళాలటసార్! ఎవ్వరూ దొరక్కపోతే మీరు రెస్టులో వుంటారుకదా అని అయ్యగారు మీకు ఆర్డరు పంపించారు.''

మళ్ళీ మీరాను చూసే అవకాశం దొరికింది. డ్యూటీ రావికొలను స్టేషను మీదుగా పోయే బండికే. ఏం మాట్లాడకుండా పుస్తకంలో సంతకంపెట్టి ఇచ్చేశాను.

మర్నాడు ట్రైను రావికొలను వచ్చేటప్పటికి సాయంత్రం మూడుగంటలయింది. వానాకాలం కావటంవల్ల ఎండ అంత తీవ్రంగా లేదు. ఆకాశమంతా తెల్లటి మేఘాలు పరుచుకున్నాయి. స్టేషనువచ్చేముందే తలుపు తెరుచుకుని చూడటం మొదలెట్టాడు తను. ఎర్ర ఓణీ, నీలం పరికిణీ - ఎప్పుడూ అదే డ్రస్సు.

ఆమె తనవంకే చూస్తోంది. మెయిల్ ఫ్యాను వచ్చాడు. తను జేబులోనుండి పదిరూపాయలు తీసిచ్చాడు. ''ఇదిగో అడ్వాన్సు... తర్వాత వస్తాను అని చెప్పు ఆమెతో.''

అతను వెకిలిగా నవ్వుతూ డబ్బు తీసుకున్నాడు. మీరా ఆనోటు వంక ఆశగా చూస్తోంది. ఆ స్టేషనులో బండి ఎక్కువసేపు ఆగదు. బండి కదిలింది. ఆమె తను కన్పించినంత వరకూ అలానే చూస్తూ నిలబడింది.

మర్నాడు తిరిగి వస్తున్నప్పుడడిగాడు మెయిల్‌ఫ్యాన్ ''తమరెప్పుడొస్తారో మీరా అడగమంద''ని

''వస్తాను... వచ్చేముందు చెప్తానుగా''

ట్రైను .... కదిలింది. ఆమె వంక నవ్వుతూ చూశాడు తను. ఆమె కళ్ళు కృతజ్ఞతతో మిలమిలలాడాయి.

ఆ తర్వాత డ్యూటీలు మారటం, తననా సెక్షన్ మీదే రొటేషన్ పద్ధతిన ఆర్నెల్ల వరకు వేయటం జరిగింది.

ఆ (ట్రిప్పు ఆదివారమయింది. పోస్టాఫీసులు పనిచేయవు కనుక, ఆర్.ఎం.ఎస్. ఆఫీసుల నుండి తప్ప పోస్టాఫీసుల నుండి ఉత్తరాల సంచులు రావు. స్టార్ట్ చేయాల్సిన మెయిల్ చాలా తక్కువగా వుంటుంది. ఆరోజు మెయిలు ప్యూనులు కూడా రారు. పనిలేకపోవడంవల్ల అంతా రెస్ట్ తీసుకుంటున్నారు. బండిలో తనను చూడగానే మీరా ముఖం వికసించినట్లయింది. అయినా ఆ కళ్ళవెనుక ఏదో దిగులు, తొట్రుపాటు, సంకోచం వ్యక్తమవుతూనే వున్నాయి. మెయిల్‌వాన్ దగ్గరకొచ్చి నిలబడింది. తను దగ్గరకు రమ్మని సైగచేశాడు. మీరా దగ్గరగా వచ్చి తలదించుకుని నిలబడింది.

ఏం మాట్లాడాలో తోచలేదు తనకు. గార్డు విజిల్ ఊదుతున్నాడు. బండి కదలబోతోంది.

''దొరా... పదిరూపాయలిత్తావు?'' అవసరం సంకోచాన్ని బలవంతంగా అదిమివేసినట్లుంది ఆమె కంఠస్వరం.

డబ్బు తీసిచ్చాడు తను. తమ చూపుల్ని దూరం దూరంగా విడదీస్తూ బండి కదిలి వేగం పుంజుకుంది.

మర్నాడు తిరిగివచ్చేటప్పుడు స్టేషనులో మీరా కన్పించలేదు. 'మీరా ఏమయింద'ని మెయిల్ ప్యూన్నడిగాడు తను. ఆరోజు వాళ్ళ బాబు రోగంతో తీసుకుపోయాట్ట. ఆమె రాలేదు.

అలా ఆమె కప్పుడప్పుడూ డబ్బు ఇస్తూనేవున్నాడు తను.

ఓసారి-

బండి ఆగటంతోనే మీరా వాన్ దగ్గరకొచ్చి నిలబడింది. తను ఐదురూపాయలనోటు తీసి ఆమెకివ్వబోయాడు. ఆమె తీసుకోలేదు.

''ఏం?'' అడిగాడు తను ఆశ్చర్యంగా.

''అన్నిమార్లు రమ్మంటి.... ఊకే పైసలెందుకు?''

''ఏం... డబ్బుతో, అవసరంలేదా?''

''ఉంది... పైస కమాయించడం తెల్సి నీకాడ బిచ్చమెందుకు దొరా?''

అర్థంగాక ఆశ్చర్యంతో చూస్తుండిపోయాడు తాను. గార్డు విజిల్ వేశాడు. బండి కదలబోతున్నది.

''ఈ ఒళ్ళు నీకాడ గిరివీ పెట్టి యియ్యాలదాక పైస తీసుకుంటి. నువ్వురావు. రుణం పెరిగిపోతావుంది. ఈ ఒళ్ళు తీరచగలదా బాబూ!''

కదులుతున్న బండితోపాటు నడుస్తోంది మీరా.

''మరెప్పుడొత్తావు?''

''వస్తాగా...''

బండివేగం అందుకుంటూంటే మీరా ఆగిపోయింది.

అలా చిన్నచిన్న సంభాషణలు జరిగినా తమ పరిచయం గాఢమవలా - ఓసారి-

తను హెడ్క్వార్టర్స్‌కి తిరిగివస్తున్నాడు. పొద్దుటినుండి ఒకటేవర్షం. ఆ వర్షానికి రైల్వే ట్రాక్ ఎక్కడ పాడయిపోతుందో అని భయంభయంగా వుంది. రావికొలను స్టేషను దాటిన బండి అరమైలు దూరంలో వున్న తుంగభద్ర బ్రిడ్జి దగ్గర ఆగిపోయింది. నది నిండుగా ఉరవళ్ళతో పారుతోంది. ఎప్పుడు నీటి ఉధృతానికి బ్రిడ్జి పడిపోతుందోననే శంకతో బండిని రావికొలను స్టేషనుకు వెనక్కు మళ్ళించారు. వర్షంవల్ల మీరా వచ్చినట్టులేదు. సాయంత్రందాకా ట్రైనక్కడే నిలిచిపోయింది. సాయంత్రం తెలిసింది నీటి ఉధృతంవల్ల ట్రైన్ మర్నాడు పొద్దున దాకా కదలదని. ఆ చిన్న స్టేషనులో తినుబండారాలేం దొరకవు. అయితే త్వరలోనే పక్కనున్న పట్నానికి వార్త చేరినట్టుంది. వ్యాపారస్తులు రకరకాల తినుబండారాలతో దిగుమతయిపోయారు. ప్రయాణీకుల అవసరాన్ని దోచేయసాగారు.

సాయంత్రానికి వాన కొంచెం తెరపినిచ్చింది. ఏం చేయటానికీ తోచక తలుపేసుకుని పడుకున్నాడు. ఎవరో తలుపు తట్టినట్టుంటే తనులేచి వెళ్ళి తలుపు తెరిచాడు. ఎదురుగా ఓ పాతికేళ్ళ యువకుడు. నీరసంగా కనిపిస్తున్నాడు. చిందరవందర జుట్టు. పెరిగిన గడ్డం. పంచెలాంటిది తొడలు పైకొచ్చేదాకా ఎగదీసి కట్టాడు. పైన వేరే ఆచ్ఛాదనేమీలేదు.

''ఏం?'' అన్నాడు తను కళ్ళతో పలకరిస్తూ.

''వాన తగ్గింది దొరా! అట్టా ఊర్లోకి రండి. బండి మల్లా రేపు పొద్దుగాలదాకా ఎల్లదంట.''

ఎదురుగా మీరా కనిపిస్తోంది. కళ్ళతో నవ్వుతూ తననాహ్వానిస్తోంది. తనకర్థమయింది.

''సరే పద'' అని, పక్క కంపార్ట్‌మెంట్‌లో పడుకున్న కొలీగ్‌కి ''తింటానికేమన్నా దొరుకుతుందేమో ఊళ్ళోకెళ్ళి చూస్తానురా'' అని చెప్పి బయల్దేరాడు తను.

అదేమంత పెద్ద ఊరుకాదు. స్టేషనులో నుండి చూడటమేకాని తనెప్పుడూ దిగలేదు అక్కడ. పెద్ద వీధిలోకి వెళ్తే మూడో సందులో అన్ని గుడిసెలకు దూరంగా వుంది మీరా గుడిసె. నిట్టాడిమీదుగా వెదురు బొంగులు దించి తాటాకు కప్పిన గుడిసె అది. తాటాకులు కూడా అక్కడక్కడ లేచిపోయి వున్నాయి.

ఇలకోళ్ళు కూస్తున్నాయి. చిన్నచిన్న నీటి గుంటల్లో చేరిన కప్పలు బావురుమంటున్నాయి. వాతావరణమంతా చైతన్యరహితంగా వుంది.

వెళ్ళగానే ఓ కుక్కిమంచం వాల్చి కూర్చోపెట్టింది మీరా. చుట్టూరా చూశాడు తను, ఓ మూల నాలుగయిదు మట్టిపాత్రలు బోర్లించి వున్నాయి. వాటిపక్కనే మూడు రాళ్ళలో మట్టివేసి

మెత్తిన పొయ్యి. పొయ్యి వెనగ్గా ఏరుకొచ్చిన ఎండుపుల్లలు. వానకు గుడిసె కురిసినట్టుంది, చాలా భాగం నీటితో తడిసిపోయింది. నులక విప్పేసిన మంచం కింద స్థానం ఆక్రమించకుండా పైకప్పు బొంగులకు కట్టేసి వుంది. బొంగుల నుండి బూజు వేలాడుతోంది. దరిద్రం తాండవిస్తోందా యింట్లో.

''కూసో దొరా...! గలాసెడు పాలు కాసి తీసుకొత్తా'' అంది మీరా.

''వద్దు .... ఇప్పుడేమీ వద్దు.''

''అయ్య అట్టగే అంటడు మావా! నువ్వు బేగెళ్ళి గంగికాడ గొల్ల పాలట్టుకురా'' అప్పటి దాకా తన ననుసరించి వచ్చిన వ్యక్తిని తను గమనించలేదు. అతను పాలకోసం వెళ్ళాడు.

''ఇంక సెప్పుదొరా... కబుర్లు'' నవ్వుతూ అంది మీరా. ఆ నవ్వు తనకు గిలిగింతలు పెట్టే నవ్వు. పుచ్చపువ్వులా తెల్లటి నవ్వు. ప్రాతఃకాలపు చల్లని పవనాంకురంలాటి నవ్వు. అందరిలా అక్కడకొచ్చిన తను ఆ చిరునవ్వులోని స్వచ్ఛతని గుర్తించే స్థితిలో లేడు. ఆ నవ్వు తన కోర్కెల దీపాన్ని వెలిగించింది. అగ్ని శిఖల జ్వాలలు హద్దులు దాటి వ్యాపించ ప్రయత్నించాయి.

''ఎప్పుడూ రమ్మని చెప్తున్నావుగా. ఇవాళ వచ్చేశాను.''

సంధ్య చీకట్లు అలుముకుంటున్నాయి.

మీరా కిసుక్కున నవ్వింది.

''ఔ...! మా దేవర దిగి వచ్చిండు.''

తను సిగరెట్టు తీసి వెలిగించాడు. ఏం మాట్లాడటానికీ తోచటంలేదు. మంచం మీద నుండి లేచి రెండుసార్లు అటూ ఇటూ తిరిగాడు. మీరా మధ్య స్తంభానికానుకుని, పైన స్తంభం పట్టుకుని, వెలిగే కళ్ళు టపటపలాడిస్తూ తనవంకే చూస్తోంది.

''అతనెవరు?'' ఆమె దగ్గరగా వచ్చి అన్నాడు తను.

''మావ''

''అంటే?''

''మావే...''

''నీ మొగుడా?''

''ఆఁ''

తను దగ్గరగా వచ్చి ఆమె భుజం మీద చెయ్యివేశాడు. దళసరి గుడ్డ మీద అద్దాలతో కుట్టిన జాకెట్టు ఆమె వక్షాన్ని కప్పుతోంది. వీపు అనాచ్ఛాదితంగా వుంది. నడుం దగ్గర ముందు నుంచి వచ్చిన రెండు బొందులు వీపు వెనక ముడివేసి వున్నాయి. జాకెట్టు మైలగా ఉంది. చెమటవాసన వేస్తోంది. తల మీదుగా వచ్చిన ఎర్రఓణి మదనకేతనంలా గుంది. కోర్కెల చీకటి తెర బుద్ధీ, చదువూ, పరువూ ప్రతిష్టలను కప్పేస్తోంది.

భుజం మీదుగా నగ్నమైన వీపు మీదకు చెయ్యి జార్చి, వీపు కండరాన్ని ఒత్తి పట్టుకునొక్కాడు తను. మీరా కిలకిలా నవ్వింది. ఊళ్ళను, ప్రాణికోటినీ ముంచెత్తే సర్వనాశనకరమైన వరదనీరు ఉధృతంగా ప్రవహించినట్లు నవ్వింది. జలపాతం కొండకొమ్ము నుండి అథఃపతనమయినట్టు నవ్వింది. చైతన్య జగత్తంతా కదిలిపోయేట్టు నవ్విందామె.

''చాలా అందంగా నవ్వుతావు నువ్వు'' అన్నాడు తను.

''ఔ. మా మాఁవాఁ అదే అంటడు...!''

మనసు తలుపు కిర్రుమన్నది. గుడిసె వాకిలి ముందుకు వచ్చి తను సిగరెట్టు వెలిగించుకున్నాడు.

''ఏడీ....! మీ మాఁవ రాలేదేం'' అతణ్ణి ఆమె భర్తగా అంగీకరించని మనసు ప్రశ్నించింది.

''వొత్తాడు - కాడీ పెట్టెయ్యి. దీపం ఎలిగిత్తా''

అగ్గిపెట్టె ఇచ్చాడు తను. కిరోసినుదీపం బుడ్డి వెలిగించి ఎత్తుగా బోర్లించివున్న కుండమీద పెట్టింది మీరా. అలుముకుంటున్న చీకటి పారిపోయింది.

చేతిలో గొట్టెపాల చెంబుతో మీరామామ వచ్చాడు.

''ఏం మావ! ఇంత ఆలీసెం జేస్తివి?''

''నే ఎళ్ళినాక పాలుతీయటం అయింది. అందాకా ఆడే కూకుండా.''

మీరా చితుకులతో పొయ్యి వెలిగించింది. చితుకులు తడిసినట్లున్నాయి, పొగవస్తోంది పొయ్యిలోనుంచి. మీరా మావ, మీరాపక్కన పొయ్యిదగ్గరగా కూర్చున్నాడు. పాలు కాగాయి. ఉన్న ఒక్క సత్తుగ్లాసు శుభ్రంగా తోమి వేడిపాలగ్లాసు తనముందుంచింది మీరా.

''సెక్కెరలేద్దొరా! ఇట్టగేతాగు'' అంది నవ్వుతూ.

తను గ్లాసు చేతిలోకి తీసుకున్నాడు. చెయ్యి కాలుతోంది. మళ్ళీ గ్లాసు కింద పెట్టాడు.

''ఏం దొరా! ఏం తింటవు! ఈ పొద్దు మాయన్నం తింటరా!'' అడిగింది మీరా, అలాగే పొయ్యి దగ్గర వెచ్చగా మామపక్కన కూర్చొని. నాగరికభాషలో మాట్లాడాలనే ఆతృతలో ఎప్పుడేదితోస్తే అలా ఏకవచన, బహువచనాల్ని ప్రయోగిస్తోంది.

''వద్దు, వద్దు... ఏం తినను, నే వెళ్ళిపోవాలి'' వేడిపాలు వూదుకుంటూ తాగుతూ అన్నాడు తను.

''అయ్యో, అదేంది...? మాతాన తినకుండెట్టెల్తావ్''

''అయితే ఓ పనిచేయి, నేను పైసలిస్తాను ఏవయినా పళ్ళు దొరికితే తెచ్చిపెట్టు.''

''అట్టనే. మావ! టేషనుకాడ కెళ్ళి అరటిపళ్ళుట్టుకురా. ఇంతలో మనకు కూడుడకేస్తా.''

మీరా మొగుడు లేచాడు, స్టేషనుకు బయలుదేరటానికి.

''పద నేనూ వస్తాను'' అని తనూ లేచాడు.

''అయ్యో దొరా! నీకు కష్టమెందుకు? ఆడుతెస్తడుగా. నువ్వు కూకుని కబుర్లాడు'' అంది కళ్ళు చికిలిస్తూ మీరా.

''కాదులే, ఇప్పుడే వస్తానుగా.''

మీరా మొగుడూ, తనూ బయలుదేరారు. దోవలో అడిగాడు తను అతన్ని ''నీపేరేమిటి? అని. అతను భయంభయంగా చూశాడు.

''భీమన్న''

''చూడు భీమన్నా! నేనెలా తెలుసునీకు?''

''మీరా సెప్పినాదిగా''

''ఏం చెప్పింది?''

''వో మీరు శానా మంచోళ్ళని సెప్తది.''

''భయపడకు, నేనెలా కనిపిస్తున్నాను నీకు?''

''మంచోళ్ళే...''

''అవునా... ఇదుగో సిగరెట్టు కాలుస్తావా?''

''వద్దయ్యా! సుట్టకాలుస్తా ఎప్పుడయినా''

''ఫరవాలేదు, ఇవాల్టికిది కాల్చు'' అని ఓ సిగరెట్టు అందించాడు తను. భీమన్న సంబరపడిపోయాడు.

''నాలాగా ఇంకెవరయినా వస్తుంటారా మీ గుడిసెకు?''

''ఓ దొరా! వత్తుంటారు'' సందేహంగా చూస్తూ అన్నాడు భీమన్న.

''వాళ్ళు రాత్రి నీ ఇంట్లో పడుకుంటే నువ్వెక్కడ పడుకుంటావు?''

''నానా... నాదేంది దొరా! టేషను పాటుఫారంకాడ తొంగుంటాను.''

''సేందీ తాగుతావా?''

''........''

''ఫరవాలేదు..... నిజం చెప్పు''

''ఎప్పుడన్నా, ఎవరన్నా మాకాడకొస్తే, మీరా పైసలిస్తది. మస్తుగా తాగేసి టేషనుకాడ తొంగుంటా.''

''మీరా ప్రవర్తన... అదే మీరా ఇలాచేయటం నీకిష్టమేనా?''

''ఛ ఛ... నాకేటిష్టం దొరా! అది నా మాటిన్దు కదా''

''నీ మాట వినకపోతే దాన్ని పట్టుకు వేళ్ళాడతావెందుకూ. వదిలేసి వెళ్ళిపోరాదూ?''

''అమ్మో! దాన్నొగ్గెయ్యటమే. నా పాణాలన్నీ దానికాడే వున్నయిదొరా! దాన్నొగ్గేసినాక, నా బతుకేంది?''

''మీరాకు నువ్వంటే ఇష్టమేనా?''

''పంచపాణాలు దొరా!''

''మరయితే ఇలా ఎందుకుచేస్తోంది?''

''ఏవో దొరా! నాకేటితెల్సు. అది చాలా వుషారు. మాలగ్గమయిన కొత్తల్లో ఎట్లుండేది, ఎట్లయిపోయినాది. గిదో నాకీ బీమారొచ్చిన కాడి నుండి అదట్టాగయి పోయినాది. 'మావ! ఒంటికాడ ఏంది. నాపాణాలన్నీ నీయేగంద. ఆళ్ళకీ ఒళ్ళు గావాల, మనకు పైస గావాల. నీరాళ్ళ కారకానసేటు యేంజేసిండు? కండలున్నంత కాలం బండలు కొట్టించుకున్నడు. బీమారొస్తే నిన్ను బయటికి తోలిండా? నే పనిచేయెళ్తే, నన్ను చెడిపేసిండా దొంగసచ్చినోడు! ఆడికంటే ఈళ్ళే నయం. ఎంతపనిజేసినా ఆడి ముకం ఆముదం ముకమే. పైసల కాడ గీసిగీసి బేరం చేస్తడు. ఈళ్ళు నగుతూ ఇస్తుండరు' అంటదిదొరా! నాకేటి తెల్సు. దొరల్తో తిరుగుతాదది. దాని తెలివి ఏం జెప్పను దొరా?''

ఒక్క క్షణం ఆగి, మళ్ళీ చెప్పుకుపోయాడు దగ్గుతెరలమధ్య.

''ఏం జేసినా అది నా పేణం దొరా! నా బతుక్కదే సుకం, అదే సొరగం.''

''మరి ఊళ్ళో వాళ్ళు ఏం అనరా?''

''అంటరు. పొరుగోళ్ళకి మేం అంటే గిట్టదు. దాని నోటికందరూ బయపడ్తరు. దాని ఎదుట ఎంత కొమ్ములొచ్చినోడూ మాట్లాడలేడంటే నమ్ముదొరా! దుమ్ములెత్తిపోస్తది. మాకే సచ్చినోడూ పనివ్వకపోతే ఏంజేయాలా, సావాలా అంటది దొరా!''

తన మనస్సు వికలమయింది. స్టేషను సమీపించింది. భీమన్న పళ్ళు కొనుక్కొచ్చాడు. తిరిగి బయలుదేరారు తామిద్దరూ.

మనసు మూగబోయిన అనుభూతి. పగిలిన మనసు ముక్కలను అతికించాలనే ప్రయత్నం. తిరిగి వచ్చేటప్పటికి మీరా గుడిసె చూరుపట్టుకుని తమకోసం ఎదురుచూస్తోంది.

''పద మావ! నువ్వణ్ణం తిను'' అంది మీరా. తనకర్థమయింది. వాడికన్నం పెట్టి పంపించే ఆలోచన ఆమెది.

రెండుమూడు అరటిపళ్ళు తినేటప్పటికి కడుపునిండినట్లయింది తనకు. ''సరే నేవెళ్తాను'' అని లేచాడు తను.

''అదేంది బాబు! యియ్యాలిక్కడే తొంగోవాల''

''కాదు, కాదు... మళ్ళీ ఎప్పుడయినా వస్తాను, ఇవాళకాదు'' మీరా తనమాటల్లోని నిశ్చయాన్ని గ్రహించినట్లుంది, బలవంతపెట్టలేదు.

''అట్టయితేనడు... టేషను కాడదాకా నేనూ వస్తా. మావః! నువ్వణ్ణం తిని పండుకో. టేషను కాడ అయ్యని దించొస్తా.''

తనూ, మీరా బయలుదేరారు. వానకురిసిన తరువాత చల్లగాలేస్తోంది. తను సిగరెట్టుతీసి వెలిగించాడు.

''వాడికేం జబ్బు?''

''ఏవోః బాబూ! ఓటే దగ్గుతుంటడు. మందుమాకు ఏడిప్పించాలి? తిండికే పైసలు కరువు. ఒక్కోసారి పాణం పొయ్యేట్టు దగ్గుతెరొస్తది. ఆణ్ణి చూస్తుంటే నాపాణం పోయినట్టుంటాది''

''అంత దగ్గు మంచిదికాదు. ఓ పనిచేస్తావా, మీమామని తీసుకుని ఓ సారి నాతోపట్నం వచ్చేయి. అక్కడ ధర్మాసుపత్రిలో మందు ఇప్పిద్దువుగాని. డబ్బు ఖర్చేంకాదు.''

''ఎట్టాదొరా! అంత పెద్ద పట్నంలో ఎట్టా బతకాల. నానెక్కడుండాల! నాతిండికయినా కావాలిగందా''

''దానికేం దిగులుపడకు. పట్నంలో నీకేదో పని దొరికేట్టు చూస్తాను. కానీ నీ ప్రవర్తన మార్చెయ్యాలి. అక్కడెలాంటి పొరపాటూ చెయ్యకూడదు.''

''అట్టాగే దొరా! తిండి దొరికితే ఎందుకు సేస్తానీపాడుపని. మామావః బీమారీ నయం జేయిత్తివా, నే సచ్చిందాక నీ బానిసుంటా''

స్టేషను సమీపిస్తోంది. స్టేషను మాస్టరు గదిలోంచి కాబోలు దీపం మిణుకుమిణుకుమని వెలుగుతున్నట్లుంది. నిద్రపట్టని జనం ప్లాటుఫారం మీద పచార్లు చేస్తున్నారు.

''సరే నే వెళ్తాను. వచ్చే మంగళవారం వాణ్ణి తీసుకుని స్టేషనుకు రా. పట్నం ఆస్పత్రిలో చూపిద్దాం.''

తను వెళ్ళబోతుంటే తన చెయ్యి తీసుకుని ముద్దు పెట్టుకుంది మీరా, ఆచీకట్లో. ఆమె మనస్సు పావురంలా సంతోషంగా కువకువలాడుతున్నట్లనిపించింది. తను బండి దగ్గరకెళ్తుంటే మీరా స్టేషను గేటు దగ్గరే నిలబడిపోయింది. ఆ చీకట్లో ఆమెకళ్ళు మిలమిల లాడటం తనకిప్పటికీ గుర్తు.

గవర్నమెంటు ఆస్పత్రిలో పరీక్షల అనంతరం భీమన్నకు టి.బి అనితేల్చారు డాక్టర్లు. అతన్ని టి.బి శానిటోరియంలో చేర్పించాడు. 'జబ్బు సెకండ్ ఫేజులో వుంది, ఎక్కువకాలం పట్టదు. ఆరునెలల్లో నయమైతుంది' అన్నారు.

రోజూ సాయంత్రంపూట శానిటోరియంకి వస్తుండేది మీరా, ఏవయినా పళ్ళూ అవీ

పెట్టుకుని. ఆరు, ఆరున్నర, ఏడింటిదాకా వుండి తిరిగి తన గుడిసెకు వెళ్ళిపోయేది. అప్పుడప్పుడు, భీమన్న ఎలావున్నాడో చూడటానికి తను కూడా వెళ్ళేవాడు.

సుమారు ఆరునెల్లవుతోంది. భీమన్నని శానిటోరియంలో చేర్పించి. అతనికి రోగం నయమైంది. ఇంకో వారంరోజుల్లో డిశ్చార్జి చేస్తామంటున్నారు. ఈ ఆరునెలల్లో భీమన్న ప్రవృతిలో చాలా మార్పొచ్చింది. ఇదివరకటి అమాయకుడు కాదు భీమన్న. తనంటే ఓ విధమైన ద్వేషభావం తలెత్తింది అతనిలో. అయినా అతను తనమాటల్లోగాని, చేతల్లోగాని ఏమీపైకి కనపర్చేవాడు కాదు.

ఆ రోజు సాయంత్రం తను ఆసుపత్రికి వెళ్లేటప్పటికి ఇంకా మీరా రాలేదు. భీమన్నను పలకరించి బాల్కనీలోనికి వచ్చి నుంచున్నాడు తను. శానిటోరియం మెయిన్ బిల్డింగ్‌కు చాలా దూరంగా వుంది మెయిన్ రోడ్డు. పెద్ద కటకటాల గేటుగుండా మెయిన్ బిల్డింగ్‌దాకా సాగిన మట్టిరోడ్డు. చుట్టూతాపచ్చని ప్రకృతి. చింతచెట్లు, మర్రిచెట్లు, వేపచెట్లూ విశాలంగా పరుచుకుని నీడనిస్తున్నాయి. సాయంకాలపు పొడువాటి ఎండ ఆ చెట్ల ఆకుల్లో నుండి చొచ్చుకువస్తూ నీడల్తో బొమ్మలు గీస్తోంది.

ఆ సాయంకాలపు నీరెండలో దూరంగా మట్టిరోడ్డు మీదుగా మీరా నడచివస్తోంది. అప్పటి మీరా కాదీమె. చాలా మారిపోయింది. పట్నవాసపు నాజూకుతనం వస్తోంది. అప్పటిలాగా లంబాడీదుస్తులు ధరించటం లేదు ఆమె. ఆమె ధరించిన ఎర్రపువ్వుల చీరె ఆమె వంపుసొంపులకు అతికేటట్లుగా వుంది. గాలికి పమిటె రెపరెపలాడుతుంటే ఏమిటోగా అన్పించింది తనకు. ఆమె అందానికి వన్నెతెచ్చేటట్టుగా వుంది యీ సాదా అలంకరణ. ఎర్ర మందారాల వికసిత హాసం లాగవుంది ఆమె. దూరం నుంచి చూస్తూనే పలకరింపుగా నవ్వింది మీరా, తనను చూసి. మెట్లెక్కిపైకి వచ్చింది.

''ఏం మావాః! ఎట్టగుండవు?'' అని భీమన్నను పలకరించింది. ఆమెని చూడంగానే అతని ముఖం ప్రఫుల్లితమైంది.

''రాయే, దొరొచ్చిండు... కారకాన కాడ కళ్ళేనా సీదా వస్తుండవు? ఎందుకే పళ్ళు మళ్ళా తెస్తివి, నిన్న తెచ్చినయ్యట్టే వుంటే'' అన్నాడు భీమన్న.

తను మంచం దగ్గరున్న స్టూల్‌మీద కూర్చున్నాడు. మీరా భీమన్న తలవేపుగా చెయ్యినానించి అతని మంచం మీద కూర్చున్నది.

''ఏంది మావాః! పిల్లోడివా... నిన్నజెప్తి. పైస కోసం సూడమాక. నీవళ్ళు మంచిగుంటే అదే పదేలంటి. నువ్విట్టా తినకుండుంటే ఎట్టా? ఇంక వారం దినాల్లో నిన్నిడిసేత్తరంట. మొన్నదొర అడిగితే పెద్ద డాట్టర్లు చెప్పినారంట. ఆ అయ్య సలవ. నావల్లేడవుద్ది ఇదంతా...'' ఆమె ముఖం తృప్తితో, కృతజ్ఞతతో మెరిసిపోతోంది. అప్పటి దాకా పనిచేసి అలసిపోయినా ఆ ముఖం ఆనందంతో మరింత అందంగా కన్పించింది.

''ఎంత కష్ట పడుతున్నాయే నాకోసం. శానా బక్కచిక్కితివి గూడ. ఏ జల్మలో జేస్తినో ఆ పున్నెం. బాబూ! తవరికి నామీద కనికరం కలిగింది.''

భీమన్న మనిసెలా వున్నా అతని మాటలు అప్పుడప్పుడు తనకు చురుకు తగులుతున్నట్లుండేవి. లేచి నిలబడి తను బాల్కనీవైపుగా నడిచాడు. వాళ్ళిద్దరూ మాటల్లో పడిపోయారు. తనలో అంతః సంఘర్షణ. మొన్న శ్రీధర్ కన్పించి అన్న మాటలే ఇంకా తన చెవిలో గింగురుమన్నట్లనిపించింది.

''ఎక్కడ కొట్టుకొచ్చావురా రమణా! ఆపికిలి పిట్టని. నువ్వు మాంచి రసికుడవోయ్. పల్లె పిల్లల సడలిపోని బింకమంతా దాన్లోనే వుంది. దానితోటి అనుభవం ఒక్కసారయినా చాలోయ్. నీ జన్మ చరితార్థమైనట్లే...'' అన్నాడు శ్రీధర్ నవ్వుతూ.

''నీకెప్పుడు అనుభవమయిందేం...?'' అడిగాడుతను.

''భలేవాడివేరా! నువ్వు తీసుకొచ్చి పరిచయం చేయిస్తివా. ఏదన్నా నౌకరీ కుదర్చమంటివి. పనిలో జేరటానికి మర్నాడొచ్చింది. నిజంగా దాన్ని చూడగానే నాకు వదలబుద్ధి కాలేదురా...''

''నీకు నౌకరీ అంత అవసరమా?'' అన్నాను.

''ఔ దొరా. మా మావకు బీమారీ దవాఖానాలో జేర్పిస్తిమి. ఇంత పెద్ద పట్నంలో బతకాలిగందా. ఆ అయ్య అంతసాయం జేసిండు, ఇంకెంత బారమెట్టేది. నౌకరీ ఇప్పించి పున్నెం కట్టుకొంటివా నీ బానిసుంటా దొరా!'' అన్నది.

''అంత పని వద్దులే. నీ ఋణం తీరే మార్గం చెప్తాను, చేస్తావా?'' అన్నాను.

''ఏంది చెప్పు దొరా!''

''నువ్వుకావాలి... ఒక్కసారే''

''వద్దు... వద్దు దొరా! ఆపని చెయ్యనని ఆ అయ్యకు మాటిచ్చివస్తి. చమించు దొరా....''

''సరే అయితే నీ ఇష్టం. నా కోరిక తీరకపోతే నీకు నౌకరీ ఇప్పించలేను. నౌకరీ లేకపోతే నీకు తిండే వుండదే, నీ మావకు పళ్ళూ మందులూ ఎక్కడ్నుండి తెస్తావు?... ఇద్దరూ కల్సి చావండి... ఊఁ వెళ్ళు...'' అన్నాను.

''ఆ ఆఖరి అస్త్రంతో లొంగిపోయింది. అహఁహఁ... ఆ మాటలతో ఓ భయంకర చిత్రం గీసుకునుంటుంది. తను, తన మావతిండికి లేక చచ్చిపోయినట్టు... పిచ్చి మొహంది...'' అని పెద్దగా నవ్వాడు శ్రీధర్.

వాడి మొహం చూస్తే సర్వ పాపాలు చుట్టుకునేట్టున్నాయి. వళ్ళు జలదరిస్తుంటే అలాగే చూస్తుండి పోయాడు తను.

అప్పుడు అన్పించింది తనకు. అవును వాడిది మాత్రం తప్పేముంది. నిస్వార్థంగా ఈ కాలంలో ఎవరు పనిచేస్తున్నారు. తను మాత్రం నిస్వార్థంగా పనిచేస్తున్నాడా. తనలో కూడా

ఏమూలో లేదా మీరా శరీరమంటే ఆశ. తను అనవసరంగా కాలయాపన చేశాడు. అర్థంలేని ఆదర్శపు కొంగు పట్టుకుని అసలు మనిషినే వదిలేస్తున్నాడు.

నల్లటి బూడిద ఆకాశంలోకి విదిపినట్లు చీకట్లు దిక్కుల్ని ఆక్రమించుకున్నాయి. ఆ చీకటి తన మనసునూ ముసిరితే తను అలాగే చూస్తూండిపోయాడు.

''పద బాబూ ఎల్దాం'' అంటూ వచ్చింది మీరా.

జట్టు విరబోసుకున్న పిశాచాల్లా వున్నాయి చెట్లు ఆ చీకట్లో. వాటి మధ్యగా మట్టి దారిలో నడుస్తూ తనన్నాడు ''పద, ఇవ్వాళ నీ గుడిసె కొస్తాను'' అని.

నవ్వింది మీరా. ఆమె తను పనిచేసే అల్యూమినియం కార్ఖానా దగ్గరే ఓ గుడిసెలో వుంటోంది. తామిద్దరూ కలసి గుడిసెకు చేరేటప్పుకి చాలా పొద్దుపోయింది.

నీలాకాశంలో కాకరపువ్వుల్లా నక్షత్రాలు పరుచుకున్నాయి. తనకు మీరాను చూస్తున్న కొద్దీ ఆకలి ఎక్కువవుతున్నట్లనిపించింది. గుడిసెలో ప్రవేశించుతూనే ఆమెను దగ్గరకు లాక్కున్నాడు.

''దొరా...'' ఆరాటంగా అంటోంది మీరా ''వద్దు...వద్దు.''

''ఏం...? కాదు ఇవ్వాళొక్కసారే....''

''వద్దు, దొరా! వద్దు... మన కాడీబందం వద్దు...'' అంది తనను వదిలించుకుంటూ. అయినా తనామెమాటకు విలువ ఇవ్వలేదు.

''ఏం శ్రీధర్ అంత అందంగా లేనా నేను. వాడి మాత్రం సాయం చెయ్యలేదా నీకు...''

''అట్టనకు దొరా... వద్దు... నాకిట్టంలేదు.... నన్నొగ్గెయ్.''

''ఏం... ఎందుకు వదలాలి. నేను ఈ చేసేదంతా ఈ శరీరం కోసమేగా. ఏం సాయం చెయ్యని వాళ్ళే అనుభవిస్తుంటే, డబ్బుపెట్టి కొనుక్కున్నాను... నీ పసందేమిటి? నా ఇష్టం...''

మీరా ఏం మాట్లాడలేదు. తన చేతుల్లో నుంచి వదిలించుకుని గుడిసె నిట్టాడి మేకుకు వేల్లాడుతున్న దీపపు వత్తి పెద్దది చేసింది.

''మీరా... చెప్పు... ఇవాళ నిన్ను వదిలేది లేదు''

''నా ఇజ్జత్ తియ్యకు దొరా!''

''పాపం! డబ్బుకోసం వళ్లమ్ముకునే దానివి... నీకు ఇజ్జత్...'' వెక్కిరింతగా అన్నాడు తను. ఆక్షణంలో ఆమె మాటలు అసహ్యంగా అన్పించాయి తనకు.

''సరే... నీ యిట్టం దొరా! నేన్చెప్పేది కాస్తినుకో. నన్ను పసందుచేసినోళ్ళకీ నాకూ ఏంది సంబందం? ఎంగిలి పండు దేవుడోరి పూజలకు ఎట్టాపెట్టేది దొరా?'' నిస్పృహగా అంటున్న మీరాకళ్ళు, ఎటూ పోలేక అన్నిదిక్కులూ బంధింపబడితే భయకంపితమైన లేడి కళ్ళలా వున్నాయి. ఆమె కళ్ళల్లోని నిరీహత, ఆ మాటల్లోని మృదులభావం తనను విహ్వలుణ్ణి చేసింది. తనమీద తనకే అసహ్యమేసింది. చదువుకుని సంఘంలో పెద్దమనిషిగా చలామణి అయ్యేతను

అనుభూతుల్లోనూ, ఆలోచనల్లోనూ, భావాల్లోనూ ఆమె కంటే ఎంత క్రింద అంతస్థులో వున్నాడో - తల్చుకుంటే మళ్ళీ ఆమె వంక తలెత్తి చూడలేకపోయాడు.

అక్కడ ఒక్క క్షణం వుండలేక గుడిసెబయటకు అడుగుపెట్టాడోలేదో ''కోపం వచ్చినాదా బాబూ!'' అని ఆతృతగా అడుగుతోంది మీరా. తన ఆగ్రహానుగ్రహాల మీద ఆమె జీవిత సర్వస్వం ఆధారపడినట్లు, సర్వజగత్తు తలక్రిందులైనట్టూ ప్రశ్నించింది మీరా.

''లేదు ... మీరా! లేదు... రేపు కనిపిస్తాను మళ్ళీ...'' అని వెళ్ళిపోయాడు తను.

భీమన్నను శానిటోరియం నుండి డిశ్చార్చిజేశారు. మళ్ళీ రావికొలను వెళ్ళిపోదామని పట్టుబట్టాడు భీమన్న.

''అక్కడైనా మీకేంపని దొరకదుగా. ఇక్కడే వుండండి. నువ్వూ ఏదయినా పని చూసుకుందువు గాని. ఇద్దరూ సంపాదించి ఏదో కలో గంజో తాగి బతకొచ్చు'' అని సలహా ఇచ్చాడు తను.

''నాకీ పట్నం పడదయ్యా! కావాలంటే మీరా నుంచుకోండి. నే ఎళ్ళిపోతాను.'' అన్నాడు భీమన్న.

''అయ్యేం మాటలు. నిన్నొదిలి ఈడ నాకేముంది? ఎల్తే ఇద్దరం ఎల్దాం'' అంది మీరా.

అతను వినడు. తనకు తెల్సు. తను మీరాను సొంతం చేసుకున్నాడని అతని భావన, కోపం. మీరా శరీరంతో ఆటలాడుకున్న వాళ్ళంటే కోపం లేదతనికి. ఆమె మనసులో చోటు చేసుకున్న వాళ్ళంటే మంట అతనికి. అతన్ని అర్థం చేసుకున్న తను వాళ్ళని పట్నంలో వుండమని బలవంతం చేయలేదు.

మీరాను, భీమన్ననూ తను డ్యూటీలో వెళ్లేటప్పుడు తీసుకువచ్చి రావికొలనులో దింపాడు. ప్రభుత్వం ఆప్రాంతంలో బలహీనవర్గాలకు బంజరుభూములు పంచిపెడుతున్నారని తెలిస్తే, ఓనెల రోజులు శెలవుపెట్టుకుని భీమన్నను వెంట పెట్టుకుని ఆ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి, అవసరమైన చోట లంచాలు పెట్టి, భీమన్నకు రెండు ఎకరాల బంజరుభూమి ఇప్పించాడు తను. బంజరు భూమిని సాగులోకి తీసుకురావటానికీ, వ్యవసాయానికి కావల్సినవి కొనుక్కోటానికీ అవసరమైన డబ్బు ప్రావిడెంట్‌ఫండు లోను తీసుకుని ఇచ్చాడు తను. వాళ్ళ జీవితం ఓగాడిలో పడిందాకా నెలకింతని పంపేవాడు. అప్పటికింకా తనకు పెళ్ళికాలేదు కనుక పెద్ద ఇబ్బంది లేకుండా చెయ్యగలిగాడు తను.

వాళ్ళ వ్యవహారం కుదుటపడిందనుకున్న తరువాత తనకు కాస్తంత మనస్థిమితం చిక్కింది. చివరిసారిగా రావికొలను నుండి వచ్చేటప్పుడు మీరాకు చెప్పాడు తను, ''ఇంకెప్పుడూ, ఎలాంటి పరిస్థితిలోనూ పడుపువృత్తి చెయ్యవద్దని'' ''సాగితే ఎందుకు చేస్తనయ్యా! మామావఁ కోసమే చేస్తిని మునుపు'' అంది ఆమె.

ఆ తరువాత తను ఆ లైనులో వెళ్ళలేదు. ఆమె రూపులోని జ్వాలారేఖ దగ్ధం చేసేట్టు కన్పించగా దూరందూరంగా వుండటమే మంచిదనుకున్నాడు. ఏనాడైనా దగ్గరితనం ఆశలు మోసులెత్తిస్తుందనే సంకోచం, పచ్చని పంట పొలానికి తెగులు తగుల్తుందేమోనన్న భయం, దూరందూరంగా వుండమనే ఆత్మ నిర్దేశంతో, తనను తనే శిక్షించుకున్నాడు. తను కామించి, గౌరవించిన మీరా మళ్ళీ దీనహీన జీవితాన్ని గడపాల్సిన అవసరం లేదు. తనెక్కడున్నా వాళ్ల కాపురం సౌఖ్యవంతంగా జరిగిపోవాలని మనస్ఫూర్తిగా కోరుకున్నాడు. తనకు ఇన్‌స్పెక్టరు ప్రమోషన్ మీద బదిలీ అయింది. మెల్లమెల్లగా మీరా స్మృతిపథంలో నుండి దూరమవసాగింది.

★ ★ ★

బండి రావికొలను స్టేషనులో ఆగింది.

రమణను చూసి మెయిల్ ఫ్యాన్ గుర్తుపట్టాడు. హెడ్ స్టార్టర్ మెయిల్ ఎక్స్‌చేంజ్‌చేసి వెళ్ళిపోయిన తరువాత ప్రశ్నించాడు రమణ ''మీరా ఎలా వుంది అని''

''అయ్యో! మీకు తెలీదా సార్! మీరానొగ్గేసి భీమన్న మళ్ళీ పెళ్ళిచేసుకున్నాడుగా. వాడికేం ఇప్పుడు. వాడిపని పైలాపచ్చీసుగా వుంది. ఇదివరకులా తెలివితక్కువ దద్దమ్మకాదుసార్ వాడు... ఇప్పుడు పెద్ద పెద్ద వ్యవహారాలు చూస్తున్నాడు. ఇప్పుడాయన పేరు భీమానాయక్. ఓ కొడుక్కూడానూ...''

''వాడి సంగతి సరే, మీరా ఎక్కడుందో, ఎలా వుందో చెప్పు''

''మీరానా... పాపం! దురదృష్టపు మొహంది. వాడు 'లంజా, నీతిమాలినదానా' అని ఇంట్లో నుండి గెంటేసిన తర్వాత, కొంతకాలం అడుక్కుతింది. దానిమొహం చూసేవాళ్ళు ఎవళ్ళూ లేరుసార్! చివరకు వాడికొచ్చిన రోగమే దీనికి పట్టుకుంది. ఇంక ఎక్కువ రోజులు బతికేట్టు లేదు సార్! నేను చూశానుగా. ఒక్కొక్కసారి దగ్గితే చారెడు చారెడు రక్తం పడుతోంది...''

''ఇప్పుడు ఎక్కడవుంటోంది?'' గార్డ్ విజిల్ విని కంపార్ట్‌మెంట్ రాడ్ పట్టుకుని బండి ఎక్కుతూ ఆతృతగా ప్రశ్నించాడు రమణ.

''అక్కడేసార్... దాని అయ్యగుడిసెలో పడుంటోంది. ఏ తల్లయినా దయతల్చి యింత అన్నంపెడితే తింటోంది. లేకపోతే అదీలేదు'' రైలు స్పీడందుకోవటంతో మెయిల్ ఫ్యాన్ నిలిచిపోయాడు.

''ఇన్‌ట్రిప్పులో ఇక్కడ దిగుతాను'' రమణ పెద్దగా వేసిన కేక గాలిహోరులో కలిసిపోయింది.

రమణ మనస్సు వికలమయింది. మనిషి జీవితం ఎంత స్వల్పం. మీరా తన శరీరాన్నమ్మి వాడి శరీరాన్ని పోషిస్తే చివరికదే విషమయిందే. వీడి పవిత్రతకది లంజయి పోయింది కాబోలు. లోకంలో ఇంతకంటే కృతఘ్నత ఎక్కడయినా వుంటుందా? డబ్బు, ఆస్తి మనిషి మనసును కప్పేస్తయ్యి కాబోలు.

భీమన్న ఇంటికివెళ్ళి వాడిగొంతు పిసికి పారెయ్యాలన్నంత కోపంగా వుంది రమణకు. తను

మర్నాడక్కడ దిగి ఎలాగయినా వాడు మీరాని చూసేట్టు చూడాలి. తను చెప్తే వినకపోతాడా? టి.బి. మొబయిల్ యూనిట్స్ వుంటాయట. వాళ్ళని కాంటాక్ట్ చేసి మీరా రోగం నయం చేయించాలి.

ఔట్ స్టేషన్ రెస్టుహౌస్ ఇన్‌స్పెక్షనుకు వచ్చిన సూపరింటెండెంటు అక్కడే కాంపువేసి వున్నాడు. అందువల్ల మర్నాడే తిరిగి రావడం పడలేదు రమణకు. రెండురోజులు ఆలస్యమయింది. అక్కడున్నంతకాలం మీరా ఎలాగున్నదోనని పీకుతూనే వుంది రమణ మనస్సులో.

అవాళ రావికొలనులో దిగిపోదామనుకున్నాడు రమణ. బండి స్టేషను సమీపించిన కొలదీ ఆతృత పెరిగిపోయింది అతనికి. స్టేషనులో బండి ఆగింది. మెయిల్‌ఫ్యాను కన్పించలేదు. ఇంకా వచ్చినట్టు లేదు. రమణ ఆలోచిస్తూ ప్లాట్‌పారం మీద నిలబడ్డాడు. అంతలో వచ్చాడు మెయిల్ ఫ్యాను.

''మీరా ఎలావుంది?'' రమణ ఆతృతగా అడిగాడు.

''ఇంకెక్కడి మీరా సార్! మొన్నే చచ్చిపోయింది. ఆ ముండ మొహం చూడటం ఎవరికీ ఇష్టంలేక మొన్నల్లా ఆ శవాన్ని ఆ ఇంట్లోనే వుంచారు. నిన్నెవరో పిల్లవెధవలు ఆ గుడిసెకే నిప్పంటించారు. గుడిసెతోపాటు అదీ కాలిబుగ్గయిపోయింది.''

అవాక్కయి అలాగే చూస్తూ నిలబడిపోయాడు రమణ.

''మీరు ఇక్కడకొచ్చిన రోజు, మీరాకెళ్ళి కన్పించి తవరొచ్చినట్లు చెప్పాను. దాని మొహం ఎంత వెలిగిపోయిందిబాబూ! తవరికి దండాలెట్టింది.''

గార్డ్ విజిల్ ఊదాడు. బండి కదిలింది. వేగం అందుకుంటోంది.

'తనిక్కడెందుకు? ఎవరికోసం?' అని స్ఫురించింది రమణకు. పరిగెత్తుకుంటూ వెళ్ళి చివరిపెట్టెలో ఎక్కాడు.

పోతున్న బండిలో నుంచి స్టేషను కిటికీలో ఎప్పుడూ మీరా కూర్చునే స్థలంవైపు చూశాడు. ఎర్ర ఓణీ, నీలం పరికిణీలో ఇంకా ఆహ్వానపూర్వకంగా చిరునవ్వు చిందిస్తూ అలాగే తొంగిచూస్తున్నట్లనిపించింది రమణకు.

దూరంగా కాలిపోతున్న మీరా గుడిసె నుండి పొగ ఇంకా వస్తూనే ఉంది. ఆరిపోయిన మీరా లాంటి కొవ్వొత్తి నుండి పొగ వస్తూనే వుంది.

ఆ దీప నిర్వాణ గంధం మీరాలాంటి దీనహీన చరిత్ర అంతమయ్యే ఉషోదయతీరం వరకూ సాగిపోతూనే వుంటుంది.

'విపుల' మాసపత్రిక,<br>ఆగష్టు, 1990